క్లుప్తంగా

రేపు శివపార్వతుల కల్యాణం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరు గంటలకు అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరీలకు విశేష అభిషేకాలు, అర్చనతోపాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలు, సాయంత్రం ఆరు గంటలకు గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి కల్యాణోత్సవం ఉంటాయని వివరించారు. భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించాలని ఈఓ రామచంద్రాచార్యులు కోరారు.

రేపు సర్వసభ్య సమావేశం

చాపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీర కిశోర్ తెలిపారు. మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య ఆధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

ఆకుకూరలతో ఆరోగ్యం



విత్తన శుద్ధి చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

కలసపాడు: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే కాయగూరలు, ఆకుకూరలతో ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లెలో ప్రకృతి వ్యవసాయం ఏటీఎం మోడల్ రైతు జయప్రసాద్ బుధవారం క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, బెండ, మటిక, మొక్కజొన్న, బీన్స్, గోంగూర, పాలకూర, తోటకూర, మెంతికూర, కొత్తమీర, కాకర, బీర, సొర వంటి విత్తనాలను పొలంలో విత్తారు. ముందుగా ఘన జీవామృతం పొలానికి చల్లి బీజామృతంతో విత్తనశుద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు మధుసూదన్, తిరుపాల్, రైతులు పాల్గొన్నారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు

ప్రొద్దుటూరు: గోపవరం ఉప సర్పంచ్ ఎన్నికపై కొండన్న చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని మాజీ సర్పంచ్ దేవీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు కొండన్న కోడలు రమాదేవికి ఉపసర్పంచ్ పదవి ఇవ్వడం జరిగిందన్నారు. ఆమె రాజీనామా చేయడంతో ఉప సర్పంచ్ ఎన్నిక జరుగుతోందన్నారు. కొండన్న టీడీపీలో చేరడంతో ఉప సర్పంచ్ ఎంపికపై మాట్లాడేందుకు రాచమల్లు ఆహ్వానించగా గైర్హాజరయ్యారన్నారు. దీంతో రాఘవరెడ్డిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకోవాలని నిర్ణయించారన్నారు.

అడవికి నిప్పు.. సమాజానికి చేటు

పోరుమామిళ్ల: అడవికి నిప్పు పెడితే మానవాళికే ముప్పు వాటిల్లుతుందని పోరుమామిళ్ల రేంజర్ రఘునాథరెడ్డి అన్నారు. మల్లేంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. మైదుకూరు వీరభద్ర కళాబృందం అటవీ చట్టాలు, ఎర్రచందనం స్మగ్లింగ్‌తో కలిగే నష్టం, వన్యప్రాణులను వేటాడడం, అడవికి నిప్పు పెట్టడం అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నారాయణ, కరునాకర్, కృష్ణయ్య, భారతి, వీరభద్రయ్య పాల్గొన్నారు.

ధర్మానిదే అంతిమ విజయం



అవగాహన కల్పిస్తున్న కళాజాత సభ్యులు

చాపాడు: ధర్మం, అధర్మాల మధ్య జరిగిన సంఘర్షణే మహాభారతమని, అంతిమ విజయం ధర్మానిదేనని టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా సభ్యులు చాపాడు వెంకట సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని సీతారామాపురం రామాలయం వద్ద బుధవారం మహా భారతంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ధర్మాన్ని అతిక్రమిస్తే, తిరస్కరిస్తే ఎలాంటి నష్టం ఏర్పడుతుందో మహా భారతం తెలుపుతుందన్నారు.

పాలకులకు చిత్తశుద్ధి లేదు

ప్రొద్దుటూరు రూరల్ : పాలకులకు చిత్తశుద్ధి లేకనే కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం శంకుస్థాపన వద్దే ఆగిందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కడప ఉక్కుపై ఆసక్తి లేదన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క హామీ నేటి వరకూ పూర్తి చేయలేదన్నారు. 2025 కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో కడప ఉక్కు పరిశ్రమకు ఒక్క రూపాయి కేటాయించకపోవడం దారుణమన్నారు. కడప ఉన్న ఏపీజీబీ బ్యాంకు కేంద్ర కార్యాలయాన్ని, కొప్పర్తి ఇండస్ట్రియల్ క్యారిడర్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను రాజధాని అమరావతికి తరలించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మనోహర్, అన్వేష్, లక్ష్మి, ఏసు దాసు, బయన్న, గఫూర్, షరీఫ్, డాక్టర్ నరసింహారెడ్డి, ముంతాజ్‌బేగం, లాయర్ హరిత పాల్గొన్నారు.

రహదారి అధ్వానం.. పర్యవేక్షణ శూన్యం



పాత అమృతానగర్‌లో నాసిరకంగా నిర్మించిన తారు రోడ్డు



సిమెంటు రోడ్డుపై మట్టి కట్టలు వేసి క్యూరింగ్ చేస్తున్న దృశ్యం

ఆరు నెలలకుపైగా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నా.. పనులు ఎలా చేస్తున్నారు, రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఏఏ మెటీరియల్ వాడుతున్నారనే విషయాన్ని పర్యవేక్షించే అధికారులే కరవయ్యారు. రోడ్డు నిర్మాణ పనులు నాసిరకంగా చేపడుతున్నా పట్టించుకునే వారు లేరు. కోట్ల రూపాయలు వెచ్చించిన రహదారి మూన్నాళ్ల ముచ్చటగా ఉంటుందని స్థానికులు విమర్శిస్తున్నారు.

- రూ.కోట్ల రోడ్డు పనులపై పర్యవేక్షణ లోపం
- సీసీ రహదారి నిర్మాణంలోనూ క్యూరింగ్ నాసిరకం

ప్రొద్దుటూరు : ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరు, రేగుళ్లపల్లె, నంగనూరుపల్లె, మీనాపురం, కొట్టాల, కొత్తపల్లె, అమృతానగర్‌ల మీదుగా చెన్నమరాజుపల్లె వరకు 15 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఇందులో భాగంగానే అమృతానగర్ పరిధిలో సిమెంటు రోడ్డుతో పాటు మరో వైపు తారు రోడ్డు నిర్మిస్తున్నారు. సిమెంటు రోడ్డు నిర్మాణం తర్వాత కనీసం క్యూరింగ్ చేసే పరిస్థితి లేదు. ఈ విషయాన్ని గమనించి కొందరు ఫిర్యాదు చేయడంతో కాంట్రాక్టర్ క్యూరింగ్ చేయడం ప్రారంభించారు. తారు రోడ్డు నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. నాశిరకం మెటీరియల్ వాడి ఒకటి రెండు రోజుల్లోనే కాంట్రాక్టర్ తారు రోడ్డు నిర్మించినట్లు తెలిసింది. ఆ పనులను సంబంధిత అధికారులు ఎవరూ పరిశీలించేందుకు రావడం లేదు. రోడ్డు నిర్మాణం పట్ల అనేక మంది ఫిర్యాదు చేస్తున్నా వారికి పట్టడం లేదు. ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ) అధికారులు ఈ పనులను పర్యవేక్షించాల్సి ఉంది. సంబంధిత ఏఈ మైదుకూరులో, డీఈ పులివెందులలో ఉంటున్నారు.

పనుల పర్యవేక్షణకు రాని మాట వాస్తవమే

పనుల పర్యవేక్షణకు రాని మాట వాస్తవమే. మైదుకూరులో ప్రస్తుతం ఏఈ లేరు. మరో అధికారికి పనుల బాధ్యత అప్పగిస్తాం. ఇది కేంద్ర ప్రభుత్వ పథకం కావడంతో రోడ్డు నిర్మాణం తర్వాత ఐదేళ్లపాటు సంబంధిత కాంట్రాక్టరే మెయింటెనెన్స్ పనులు చేపట్టాల్సి ఉంటుంది. కోర్ కటింగ్ ద్వారా పనులను నాణ్యత పరిశీలిస్తారు. సెంట్రల్ టీం పనుల పరిశీలనకు వస్తుంది.

- సుధాకర్‌రెడ్డిన, డీఈ

నేడు ఉప సర్పంచ్ ఎన్నిక

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం జరగనుంది. గ్రామ పంచాయతీలో మొత్తం 20 మంది వార్డు సభ్యులు ఉన్నారు. ఉప సర్పంచ్ పదవిని అధికార టీడీపీ చేజిక్కించుకోవాలని అడ్డదారుల్లో అడుగులేస్తున్నట్లు తెలుస్తోంది. వార్డు మెంబర్లకు ఆశలు చూపి సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని వారిని తమవైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఉప సర్పంచ్‌గా తమ పార్టీ మద్దతుదారురాలైన మండ్ల రమాదేవికి ఓటు వేయాలని, లేని పక్షంలో అక్రమ కేసులు బనాయిస్తామని, ఇబ్బందులకు గురి చేస్తామని కొందరు వార్డు మెంబర్లకు హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికల అధికారిగా ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డి వ్యవహరిస్తున్నారు. ఉప ఎన్నిక నిర్వహణకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

ప్రొద్దుటూరు రూరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీ ఫీడర్‌లో గురువారం ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ నార్త్ సెక్షన్ ఏఈ అబ్దుల్ జబ్బార్ ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా వైఎంఆర్ కాలనీ మెయిన్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కాశినాయన ఆశ్రమాన్ని అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కాశినాయన : జ్యోతిక్షేత్రంలోని కాశినాయన ఆశ్రమాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పేర్కొన్నారు. స్థానిక కాశినాయన ఆశ్రమంలో అనుమతులు లేవంటూ అటవీ అధికారులు కూల్చివేసిన కట్టడాలను బుధవారం వారు పరిశీలించారు. అనంతరం విలేకరులతో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి కాశినాయన ఆశ్రమానికి అనుమతులు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఆశ్రమ అభివృద్ధికి ఏమి చేయాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చర్చలు జరుపుతున్నారన్నారు. జ్యోతి క్షేత్రానికి 13 ఎకరాలకు అనుమతులు తెచ్చి సకల సౌకర్యాలు సమకూరుస్తామని తెలిపారు.

అనాథలకు బియ్యం, సరుకులు పంపిణీ



సరుకులు అందజేస్తున్న నారాయణ, ఎస్‌ఐ హనుమంతు

కాశినాయన : అనాథలకు, అభాగ్యులకు ఆశ్రయం కల్పించడం అభినందనీయమని ఎస్‌ఐ పి.హనుమంతు అన్నారు. మండలంలోని ఓబుళాపురం సగిలేరు ఒడ్డున గల వివేకానంద సేవాశ్రమానికి షేర్ ది విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బియ్యం, కందిపప్పు, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వంట సామగ్రిని ఎస్‌ఐ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పోరుమామిళ్లకు చెందిన సంస్థ అధ్యక్షుడు పొదిలినారాయణ వ్యాపార రీత్యా తెలంగాణలోని ఖమ్మంలో స్థిరపడి తన సంపాదనలో కొంత భాగాన్ని అందించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, రామతులసి ఎస్‌ఐను శాలువా, జ్ఞాపికలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ

మైదుకూరు : మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ సేంద్రియ ఎరువుల వాడకం, వాటి ప్రాధాన్యత గురించి రైతులకు వివరించారు. భూమిలో కర్బన శాతం పెంచే విధి విధానాల గురించి తెలిపారు. సేంద్రియ ఎరువులపై కేవీకేకు ప్రాజెక్టు మంజూరైందని, ఖరీఫ్ నుంచి అమలు చేస్తామన్నారు. కొర్ర, మినుము పంటలను రైతులు సాగు చేసే విధంగా చూస్తామన్నారు. సేంద్రియ, రసాయనిక ఎరువులను వినియోగించి ఖరీఫ్, రబీ కాలాల్లో ఎలాంటి ఫలితాలు వచ్చాయనేది పరిశీలిస్తామని.. ఫలితాలను రైతులకు వివరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భరత్‌కుమార్, శరవణన్, విద్యారాణి, బీఎస్.కాంతిశ్రీ, ఫిరోజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

300 మంది పేదలకు రంజాన్ తోఫా



రంజాన్ తోఫాను అందిస్తున్న షబ్బీర్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం సమీపంలోని మహమ్మదీయ కాలనీలో ఉంటున్న షేక్ షబ్బీర్ 300 మంది పేదలకు బుధవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా పేదలకు రంజాన్ తోఫా అందిస్తున్నామని, ప్రతి ఒక్కరూ వారికి చేతనైన సహాయం అందించి అందరినీ ఆదరించాలన్నారు. అనంతరం బియ్యం, చక్కెర, నెయ్యి, సేమియా, గోధుమ పిండి, జకాత్, ఫిత్రా, చీరెలు, పంచెలు, చొక్కాలతో కూడిన తోఫాను పేదలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షాహుల్ ఎజ్‌దాన్, సమద్, దిల్‌కుష్, సుజిత్, సుబ్బయ్య, జమాల్‌వలి, ఖాజాహుస్సేన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి

బద్వేలు అర్బన్ : పిల్లల సమగ్రాభివృద్ధికి అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఐసీడీఎస్ బద్వేల్ ప్రాజెక్టు సీడీపీఓ ఎం.శ్రీదేవి, కోటవీధి అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య పేర్కొన్నారు. పోషణ్ బీ – పఢాయి బీ కార్యక్రమంలో భాగంగా కోటవీధి ప్రాథమిక పాఠశాల ఆవరణలో అంగన్వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో నూతన విద్యా విధానం అమలు కానుందని, శిక్షణలో చెప్పిన అంశాలపై అవగాహన పెంచుకుని కేంద్రాలను సక్రమంగా నడపాలని కోరారు.ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, సుబ్బలక్ష్మమ్మ, సుజన, విజయమ్మ, లక్ష్మీదేవి, సువర్ణ, అరుణ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోర్టులో ఉన్నా.. కూలగొట్టేస్తారా...?

ధర్నాకు దిగిన పేద దంపతులు



స్థల డాక్యుమెంట్లను చూపుతున్న బాధితులు సావిత్రి, ఓబుళ కొండయ్య

ప్రొద్దుటూరు రూరల్: కోర్టులో ఉన్నా.. కూలగొట్టేస్తారా అంటూ ఓ పేద వృద్ధ దంపతులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కొత్తపల్లె పంచాయతీ మైదుకూరు రోడ్డులోని రిలయన్స్ పెట్రోలు బంకు ఎదురుగా రూములను పంచాయతీ అధికారులు, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అన్యాయంగా కూల్చారని ఓబుళకొండయ్య, సావిత్రి అనే పేద దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. రూంను కూల్చిన చోటే తమకు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ తనకు పసుపు కుంకుమ కింద అర సెంట్ స్థలం పుట్టింటి వారు ఇచ్చారని తెలిపారు. తన భర్త వృత్తి రీత్యా లారీ డ్రైవర్ కావడంతో ఆ స్థలంలో రూం ఏర్పాటు చేసి అద్దెకు ఇస్తే జీవనానికి ఆసరా ఉంటుందని అప్పులు చేసి రూం నిర్మించామన్నారు. ఆదివారం అర్ధరాత్రి ఆ రూం బంజరు స్థలంలో ఉందని పంచాయతీ అధికారులు, సర్పంచ్ తొలగించారన్నారు. కోర్టు నోటీసులు గ్రామ పంచాయతీ అధికారులకు, ఆర్‌అండ్‌బీ అధికారులకు సమర్పించామని, అయినప్పటికీ వారు కోర్టు నోటీసులను ధిక్కరించి కూల్చడం దారుణమన్నారు. మాకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తమ రూంను తొలగించడం అన్యాయమన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఆత్మహత్య చేసుకుంటామని తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

పోరుమామిళ్ల : మండలంలోని చల్లగిరిగెల పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ రమణారెడ్డి బుధవారం పరిశీలించారు. ఉపాధి పనులు పక్కాగా ఉండాలని, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. అనంతరం స్త్రీ శక్తి భవన్‌లో కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ నీటి సమస్య తలెత్తకుండా శ్రద్ధ తీసుకోవాలన్నారు.

రామమోహన్‌రెడ్డికి పరామర్శ

పోరుమామిళ్ల : సిద్దవరం పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకుడు దివంగత రమణారెడ్డి అల్లుడు రామమోహన్‌రెడ్డిని బుధవారం ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పరామర్శించారు. రామమోహన్‌రెడ్డి ఇటీవల అస్వస్థతకు గురై గుండెకు స్టంట్ వేయించుకొని వచ్చారు. నాగార్జునరెడ్డి పోరుమామిళ్లలో ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్యంపై వివరాలు తెలుసుకున్నారు.

అన్నమాచార్యుల వర్ధంతి

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తాళ్లపాక అన్నమాచార్యుల వర్ధంతి నిర్వహించారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి అన్నమయ్య చిత్ర పటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా అన్నమాచార్య కళాపీఠం గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ అన్నమాచార్య 32వేల సంకీర్తన పుష్పాలను అందించారని, సువ్వి, పెండ్లి, నివాళి పాటలలో తెలుగువారి ఆచార సంప్రదాయాలు కళ్లకు కట్టినట్టు వర్ణించారన్నారు. ఈ కార్యక్రమంలో యడవల్లి రమణయ్య, కొత్తమిద్దె రఘురామిరెడ్డి, అంకాల్ కొండయ్య, ఉపాధ్యక్షుడు సాయికుమార్ పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రొద్దుటూరు : పట్టణంలోని పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి చెందడంతో రాష్ట్ర మాల మహానాడు, దళిత ప్రజా సంఘాలు, పాస్టర్ల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపాయి. రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మురళీ ప్రసాద్, మేకల ఓబులేసు, ఉల్లి కిరణ్‌కుమార్, అరుణ్‌కుమార్, లక్ష్మయ్య, పందిటి మోహన్, సీకే కుమార్, ప్రణయ్ కుమార్, పాస్టర్లు స్నూకర్ భాస్కర్, సంపత్ కుమార్, డేవిడ్, బండి డానియేల్ తదితరులు పాల్గొన్నారు.


పప్పు దినుసు పంటలతో ప్రయోజనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.నాగరాజ

అట్లూరు : పప్పు దినుసు పంటలలతో రైతులకు ప్రయోజనం ఉంటుందని బద్వేల్ వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. మండలంలోని చింతలచెరువు రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నాగరాజ మాట్లాడుతూ రైతులు సజ్జ, రాగి, జొన్న పంటలతోపాటు పప్పుదినుసు, చిరు ధాన్యాల పంటలు సాగు చేసుకోవాలన్నారు. అనంతరం నూనె గింజల పంటలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి, పవన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

30న పెద్ద పీరయ్య ఆరాధన



ముడుమాలలో సిద్ధయ్య మఠం

బ్రహ్మంగారిమఠం : కాలజ్ఞాన ప్రబోధకర్త పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి శిష్యుడు దూదేకుల సిద్ధయ్య కుమారుడు పెద్దపీరయ్యస్వామి ఆరాధన ఈ నెల 30న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 30న ఉదయం పది గంటలకు పూల పూజ, రాత్రికి గ్రామోత్సవం ఉంటాయి. భక్తులకు అన్నదానం, భజన, డ్రామాలు, చిన్నాయపల్లె గ్రామస్తుల ఆధ్వర్యంలో సినీ పాట కచేరీ, కోలాటం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 31న బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు. వరుస విజేతలకు రూ.1,00,116, రూ.70,116, రూ.45,116, రూ.30,116, రూ.15,116 ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతోపాటు 16 మనుముల గుండు ఎత్తే పోటీల్లో వరుస విజేతలకు 25,116, రూ 2,016, రూ.1,116 అందివ్వనున్నారు. 13 మనుముల గుండు ఎత్తే పోటీలు ఉంటాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు అధికంగా రానున్నారు.

జెడ్పీ చైర్మన్ పీఠంపై ద్వంద వైఖరి

ఖాజీపేట : జెడ్పీ చైర్మన్ పీఠం కోసం మేం పోటీ చేయడంలేదు. సమావేశం వాయిదా వేయాలని హైకోర్టులో వ్యాజ్యం వేయడం కూటమి నాయకుల ద్వంద వైఖరికి నిదర్శనమని ఎపీఎస్సార్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ జెడ్పీటీసీ సభ్యుల సంఖ్యా బలం లేకపోవడంతో తాము పోటీ చేయడంలేదని కూటమి నేతలు ప్రకటించారని గుర్తు చేశారు. టీడీపీ జెడ్పీటీసీ ద్వారా పోటీని వాయిదా వేయాలని కోర్టును ఆశ్రయించడం చూస్తే రెండునాల్కల ధోరణి కనిపిస్తోందన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని మున్సిపల్ ఎన్నికల్లో ఏమీ చేయలేకపోయారని, నేడు ఎన్ని కుట్రలు చేసినా జెడ్పీ చైర్మన్‌గా రామగోవిందరెడ్డి ఎన్నిక కవడం ఖాయమన్నారు.

ఆదివాసీల హత్యలను ఆపాలి



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు రూరల్ : ఎన్‌కౌంటర్ల పేరుతో ప్రభుత్వం చేస్తున్న ఆదివాసీల హత్యలను ఆపాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మ ఆదివాసీ గ్రామాలను, సహజ సంపదను పాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పెసా చట్టాన్ని అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల అణచివేతకు సాయుధ బలగాలను కేటాయించినట్లుగా తెలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, నాగేంద్ర, ప్రసాద్, విరసం వరలక్ష్మి, లక్ష్మీదేవి, రామయ్య, సుబ్బరాయుడు, సురేష్‌బాబు, సురేష్, పద్మ, రషీద్‌ఖాన్, మురళి, కృష్ణ యాదవ్, బాష, దస్తగిరి, జయచంద్ర, హరిత, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ధర లేక.. రైతు దిగాలు

- పసుపు పంటకు గిట్టుబాటు లేదంటున్న రైతులు
- గతేడాది ధర ఉండేలా చూడాలని విన్నపం



పొలాల్లో పసుపు రాశులు

చాపాడు : పసుపు ధర ఈ ఏడాది తగ్గింది. విత్తు నుంచి తవ్వకాల వరకూ కంటికి రెప్పలా కాపాడుకుంటూ పండించిన రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ధరలు మరింత తగ్గు ముఖం పట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైలు కోరుతున్నారు. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా గతేడాది జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో 2,402 ఎకరాల్లో రైతులు పసుపు పంట సాగు చేశారు. 2023–24లో 1,963 ఎకరాల్లో పసుపు సాగవగా, 2024–25 ఏడాదిలో 2,402 ఎకరాల్లో పంట వేశారు.

దిగుబడులు అంతంతమాత్రమే..

పసుపు పంట సాగు చేసేందుకు రైతుకు ఏటా సాగు ఖర్చు పెరుగుతూనే ఉంది. ఎకరాకు రూ.1.60 లక్షల వరకూ ఖర్చు అవుతుండగా, కౌలు రైతులకు రూ.40 వేలు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఈ లెక్కన ఎకరా సాగుకు రూ.2 లక్షల వరకూ పెట్టుబడి అవుతోంది. దిగుబడులు ఎకరాకు 30–35 క్వింటాళ్లు రావాల్సి ఉండగా, కొన్ని చోట్ల 25–30 క్వింటాళ్లు, మరిన్ని చోట్ల 15–25 క్వింటాళ్ల వరకూ దిగుబడులు వస్తున్నాయి. ప్రస్తుత ధరలకు పసుపు విక్రయిస్తే రైతు నష్టపోయే పరిస్థితి.

ధరలు తగ్గుముఖం

గతేడాది క్వింటా పసుపు ధర రూ.14–15 వేలు పలికింది. ఈ సారి రూ.9,500 నుంచి రూ.10,500 వరకూ నాణ్యతను బట్టి యార్డుల్లో ధర నిర్ణయిస్తున్నారు. గతేడాది మాదిరిగానే ధరలు ఉంటాయనే ఆశతో సాగు చేసిన రైతుకు నిరాశ తప్పడం లేదు. ప్రభుత్వం ధరలు పెంచేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మైదుకూరు నియోజకవర్గంలో సాగు వివరాలు (ఎకరాలలో)	
మైదుకూరు	1009
చాపాడు	340
దువ్వూరు	582
ఖాజీపేట	413
బ్రహ్మంగారిమఠం	58
మొత్తం	2402

గిట్టుబాటు ధర లేదు



ఈ సారి 1.75 ఎకరాల్లో పసుపు సాగు చేశా. దిగుబడి ఆశాజనకంగానే ఉంది. ధర మాత్రం రూ.10 వేల లోపే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది క్వింటా రూ.14 వేల నుంచి రూ.15 వేల వరకూ పసుపు కొనుగోళ్లు జరిగాయి. ఇదే ధరలు వస్తే మంచి జరుగుతుంది.

- మార్తల గురివిరెడ్డి, రైతు, సీతారామాపురం, చాపాడు మండలం

రెండు ఎకరాల్లో సాగు చేశా



రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని పసుపు పంట సాగు చేశా. ఎకరా సాగు కోసం రూ.2లక్షలు ఖర్చు చేశా. ధరలు ఈ సారి తగ్గాయి. దిగుబడులు 20 క్వింటాళ్ల లోపే వచ్చేలా పంట ఉంది. ఎకరా కౌలుకు రూ.40 వేలు చెల్లించాలి.

- వెంకటస్వామి, రైతు, అల్లాడుపల్లె పొలం, చాపాడు మండలం